

అనురాధ, గౌతంలకు శుభాకాంక్షలు చెబుతున్న కేటీఆర్

ముషీరాబాద్‌లో పెళ్లికి హాజరైన కేటీఆర్

ముషీరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, సరిత దంపతుల కూతురు అనురాధ వివాహానికి మాజీమంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డిలు హాజరయ్యారు. అనంతరం నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బింగి నవీన్, దీన్‌దయాల్‌రెడ్డి, శివముదిరాజ్, శంకర్‌గౌడ్, శ్రీధర్‌చారి పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ పద్మ నివాసానికి..

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముఠా పద్మనరేశ్‌ను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు, మాజీమంత్రి కేటీఆర్ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల వెన్నెముక సమస్యతో సర్జరీ చేయించుకున్న ఆమెను గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ సిద్ధంశెట్టి అపార్ట్‌మెంట్స్‌లోని ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు.

బీసీ కమిషన్ చైర్మన్‌కు అభినందనలు

చిక్కడపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.నిరంజన్‌ను రాష్ట్ర కురుమ సంఘం సభ్యులు శుక్రవారం అభినందించారు. ఈమేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.రమేష్‌కుమార్, కోశాధికారి కె.రామాంజనేయులు, సభ్యులు బుచ్చప్ప శుభాకాంక్షలు తెలిపారు.



నిరంజన్‌ను అభినందిస్తున్న రమేష్‌కుమార్

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ముషీరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎన్నికల హామీలను అమలు చేయలేక పూర్తిగా విఫలం అయిందని బీఆర్ఎస్ సీనియర్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు విమర్శించారు. హామీలు నెరవేర్చలేక తమ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే మూసీ అభివృద్ధి, హైడ్రా పేరుతో సీఎం నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. శుక్రవారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైడ్రాలో సీఎం రేవంత్‌రెడ్డి బంధువులు ఉండడంతో ఆ కట్టడాలను కూల్చలేక కేసుల పేరుతో కాలయాపన చేస్తూ పేదల ఇళ్లను మాత్రం కూల్చివేస్తున్నారని విమర్శించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం అంకితభావంతో పని చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో వివేక్, జంగ శ్రీనివాస్, మహేష్, గోరే పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు



ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పిస్తున్న ఏసీపీ సంపత్‌కుమార్

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

బర్కత్‌పుర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఏసీపీ సంతప్‌కుమార్ సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపితే ప్రమాదకరం అని, ఏ చిన్న సంఘటన జరిగినా ప్రాణహానిగా మారుతుందని ఆయన అన్నారు. శుక్రవారం బర్కత్‌పుర చౌరస్తా వద్ద కాచిగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హెల్మెట్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ సంతప్‌కుమార్ మాట్లాడుతూ.. చాలామంది విద్యార్థులు, యువత తొందరగా వెళ్లడానికి రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేస్తున్నారని, ఇది ప్రమాదకరం, ప్రాణాలు కూడా కోల్పోతారని హెచ్చరించారు. సిగ్నల్స్ వద్ద నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కాచిగూడ ట్రాఫిక్ ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



కార్పొరేటర్ ఉమాదేవికి సభ్యత్వ నమోదు ఫారాలను అందజేస్తున్న గౌతంరావు

గ్రేటర్‌లో బీజేపీని బలోపేతం చేయాలి

బర్కత్‌పుర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. ఒకవైపు పార్టీని బలోపేతం చేస్తూనే మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన కోరారు. శుక్రవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో వంద మందిని సాధారణ సభ్యత్వం చేర్పించిన వారికి క్రియాశీల సభ్యత్వ ఫారాలను కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో పాటు పలువురు నేతలకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ శ్యామ్‌రాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.నందకిషోర్ యాదవ్, ఉపాధ్యక్షులు కన్నె రమేష్‌యాదవ్, వనం రమేష్, కృష్ణకుమార్, సుభాష్‌పటేల్, యశ్వంత్, క్షీరసాగర్, నాగభూషణం చారి పాల్గొన్నారు.

శాంతియుతంగా సదర్ సమ్మేళనాలు

బర్కత్‌పుర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పు మండలం పరిధిలోని నారాయణగూడ వైఎంసీఏ వద్ద ఈనెల 2న నిర్వహించిన సదర్ సమ్మేళనం ప్రశాంతంగా నిర్వహించడంలో కృషి చేసిన డీసీపీ బాలస్వామిని శాలువాతో ఘనంగా శుక్రవారం సత్కరించారు. సదర్ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించడంలో తమకు తూర్పుమండలం పోలీసు అధికారులు ఎంతో సహకరించారని తెలంగాణ యాదవ సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్ సి.వినోద్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో యాదవ సేవా సంఘం ప్రతినిధులు రవియాదవ్, రవీందర్, ఆనందదాస్ తదితరులు పాల్గొన్నారు.



డీసీపీ బాలస్వామిని సత్కరిస్తున్న సి.వినోద్‌యాదవ్ తదితరులు

భారతికి ఇంటర్నేషనల్ లయన్స్ అవార్డు ప్రదానం

చిక్కడపల్లి: ప్రముఖ సంఘ సేవకురాలు, నాట్య గురు డా.ఎస్‌పీ భారతికి లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అవార్డును ప్రదానం చేశారు. శుక్రవారం సాయంత్రం లయన్స్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్ మనోహర్‌రెడ్డిలు అవార్డును భారతికి బహూకరించి అభినందించారు. భారతి మాట్లాడుతూ తమ ఒక శరణాలయంలో 20 మంది బాలికలకు గత కొన్ని సంవత్సరాలుగా ఉచితంగా కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. తనకు అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.



భారతికి అవార్డును బహూకరిస్తున్న అతిథులు

అంతర్గత రోడ్లు అస్తవ్యస్తం

● గుంతలుపడి కంకరతేలిన వైనం ● పట్టించుకోని అధికారులు ప్రజాప్రతినిధులు ● ఇబ్బంది పడుతున్న ప్రజలు

రాంనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేని కారణంగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని అంతర్గత రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కంకర తేలి గుంతలు పడి అస్తవ్యస్తంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్లు తమకు శాపంగా మారాయని ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలోని ప్రధాన చౌరస్తాలతో పాటు పలు రహదారులు, కాలనీలు. బస్తీలలోని అంతర్గత రోడ్లు గుంతలు పడి కంకర తేలడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ సమస్యలపై అధికారులు, ప్రజా ప్రధినిధులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మరమ్మతులు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ లైన్లు, తాగునీటి పైప్‌లైన్లు వేసిన ప్రాంతాల్లో రోడ్డు ప్యాచ్ వర్కు పనులు సైతం చేయలేదు. అడిక్‌మెట్ డివిజన్‌లోని లక్ష్మమ్మ పార్కు చౌరస్తా నుంచి చర్చికి వెళ్లే దారిలో డ్రైనేజీ లైన్లు వేసి నెలలు గడిచినా రోడ్డు మరమ్మతులు చేయలేదు. దీంతో ఈ రోడ్డు ప్రజలు నడవలేని విధంగా తయారైంది. అదే ప్రాంతంలో మదర్ స్కూల్ చౌరస్తాలో కూడా రోడ్డు దెబ్బతిని కంకర తేలి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ముషీరాబాద్ డివిజన్‌లోని శాస్త్రినగర్ చౌరస్తా అటు నుంచి బ్రహ్మంగారి గుడి వీధికి వెళ్లే మార్గంలో సైతం రోడ్లు దెబ్బతిన్నాయి. బాకారంలోని రాజా డీలక్స్ చౌరస్తాలో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. గుంతలు పూడ్చి ప్రజల ఇబ్బందులను తొలగించాలని స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులను కోరుతున్నారు.



లక్ష్మమ్మ పార్కు వద్ద గుంతలమయంగా మారిన రోడ్డు



మదర్ స్కూల్ నుంచి లక్ష్మమ్మ పార్కుకు వెళ్లే రోడ్డులో ప్యాచ్ వర్కు చేయని దృశ్యం



శాస్త్రినగర్ చౌరస్తాలో గుంతలమయంగా మారిన రోడ్డు

14న ప్రతిభ పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి: జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14న సాయంత్రం త్యాగరాయగానసభలో ప్రతిభ పారితోషిక పురస్కారాల ప్రదానసభను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ జి.వెంకటరెడ్డి తెలిపారు. వివిధ రంగాల ప్రముఖులకు ఈ పురస్కారాలతో పాటు నగదు పురస్కారం ఉంటుందని తెలిపారు.

12న 52 మంది రచయితలకు సత్కారం

చిక్కడపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వంశీ ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 12న త్యాగరాయగానసభలో 52 మంది కథా రచయితలు, రచయిత్రులకు సత్కారం చేయనున్నట్లు నిర్వాహకులు వంశీ రామరాజు, డా. తెన్నేటి సుధ, శైలజ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు శుక్రవారం తెలిపారు. 52 మంది రాసిన కొత్త కథలు 6వ భాగం ఆవిష్కరణ సభలో ఈ సత్కారం ఉంటుందన్నారు. ముఖ్యఅతిథిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ పాల్గొని సంపుటిని ఆవిష్కరిస్తారని, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహిస్తారన్నారు.

ప్రపంచ శాంతి మహాసభలకు భారత్ ప్రతినిధిగా దిడ్డి సుధాకర్

కవాడిగూడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నేపాల్ రాజధాని ఖాట్మాండులో ఈనెల 9వ తేదీ నుంచి 11 తేదీ వరకు ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ వరల్డ్ పీస్ కౌన్సిల్ ఆధర్వంలో జరిగే ప్రపంచశాంతి మహాభలకు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐపీసో) తరపున జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిడ్డి సుధాకర్ భారతదేశ ప్రతినిధిగా హాజరవుతున్నారని తెలంగాణ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం నగరంలోని ఐపీసో రాష్ట్ర కార్యాలయంలో డాక్టర్ దిడ్డి సుధాకర్‌ను ఆ సంఘం తరపున సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. వరల్డ్ పీస్ కౌన్సిల్ అనేది వంద కంటే ఎక్కువ దేశాలలో ఉన్న అతిపెద్ద అంతర్జాతీయ శాంతి నిర్మాణ సంస్థ అని, రష్యా, ఉక్రెయిన్, మధ్య ప్రాచ్యమ్‌లో క్రూరమైన యుద్ధాలు మారణహోమం జరుగుతున్న నేపథ్యంలో ఈ మహాసభ నేపాల్‌లో జరుగుతుండటం ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. ఐపీఓ రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు ఎంఆర్‌జి వినోద్‌రెడ్డి, డాక్టర్ తిప్పర్తి యదయ్య, మెట్ల జగన్, హైదరాబద్ ప్రధాన కార్యదర్శి రామరాజు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నాగేష్, అంజన్‌కుమార్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



దిడ్డి సుధాకర్‌ను సన్మానిస్తున్న ఐపీసో ప్రతినిధులు

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఆవిర్భావ వేడుకలు

కవాడిగూడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ వేడుకలు నగరంలోని దోమలగూడలోని రాష్ట్ర కార్యాలయంలో ఆ సంస్థ రాష్ట్ర చీఫ్ కమిషనర్ బుర్రా వెంకటేషం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి సి జె అరుణ్‌కుమార్, కోశాధికారి ఎం రాజ్‌గోపాల్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ జి పరమేశ్వర్ తెలిపారు. శుక్రవారం కార్యాలయ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 9, 10, 11 తేదీలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావం సందర్భంగా మినీ స్టేట్ ర్యాలీతో పాటు వివిధ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో 9వ తేదీ ఎంపీ ఈటల రాజేందర్, 10వ తేదీ రాష్ట్ర గవర్నర్, స్టేట్ చీఫ్ కమిషనర్ బుర్రా వెంకటేశం, గవర్నర్ జాయింట్ సెక్రటరీ భవానిశంకర్, 11వ తేదీ ముగింపు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్యే కెపి వివేకానందగౌడ్, కార్పొరేటర్ రచనశ్రీలు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమల్లో ఉత్తమ సేవలు అందించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి ప్రశాంసా పత్రాలతో సన్మానిస్తున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో ఈ జాన్ సామెల్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

చిక్కడపల్లి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సిటీకల్చరల్ సెంటర్‌లో సెవెన్‌హిల్స్ సంస్థ ఆధ్వర్యంలో శివనంది అవార్డుల బహూకరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొని అవార్డులను బహూకరించి మాట్లాడారు. కళాకారులు, కళాసంస్థలకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు పోతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, డబ్బింగ్ ఆర్టిస్ట్ ఏడుకొండలు, యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, త్రినాథరావు, పద్మావతి పాల్గొన్నారు.



● సభ్యత్వ నమోదు

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగర కార్యాలయంలో పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎం గౌతమ్‌రావు నుంచి సభ్యత్వం తీసుకుంటున్న బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.యశ్వంత్, నేతలు నాగభూషణంచారి, వెంకటస్వామిగౌడ్.

\- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి



● సీఎం జన్మదిన వేడుకలు

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లకుంటలోని చౌరస్తాలో వందే ప్రజా ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఎంకె శ్రీనివాస్, మధులు సిఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంచారు.

\- రాంనగర్, ఆంధ్రజ్యోతి

కుటుంబ సర్వేకు స్టిక్కర్ల కొరత

● పలు ప్రాంతాలలో ఇంటికి రాని ఎన్యూమరేటర్లు ● తూతూమంత్రంగా సర్వే

ముషీరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే ముషీరాబాద్‌లో అంతంతమాత్రంగానే కొనసాగుతోంది. పలు ప్రాంతాల్లో మూడు రోజులైనా ఇంటికి రాని ఎన్యూమరేటర్లు. దీంతో సర్వే జరుగుతున్నదా లేదా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది కొరత, ఇంటింటికి అంటించే స్టిక్కర్లు కూడా ఎన్యూమరేటర్లకు ఇవ్వకపోవడంతో కేవలం ఇంటి యజమాని పేర్లు రికార్డులో రాసుకొని వెళ్తున్నామని ఎన్యూమరేటర్లు పేర్కొంటున్నారు. 588 మంది ఎన్యూమరేటర్లను అధికారులు ఏర్పాటు చేసినా ఆరు డివిజన్లకు సరిపోవడం లేదు. ఒక్కో ఎన్యూమరేటరు 150 నుంచి 175 ఇళ్లకు వెళ్లి మొదటి మూడు రోజులు స్టిక్కర్లు అంటించాల్సి ఉన్నప్పటికి రాంనగర్, మేడిబావి బస్తీ, భోలక్‌పూర్, ముషీరాబాద్‌లో ఇప్పటి వరకు ఎన్యూమరేటర్లు రాలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకోగా కేవలం 50 నుంచి 60 ఇళ్లను సంప్రదించేందుకే సమయం సరిపోతున్నదని, అందు వల్లే అందరి ఇళ్లకు వెళ్లలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఎన్యూమరేటర్లకు సర్వే చేసినందుకు రూ.10 వేలు ఇస్తామని చెప్పినప్పటికి కొంతమంది సర్వేకు హాజరుకావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. 9వ తేదీ నుంచి ఇంటికి స్టిక్కర్లు అంటించిన చోటుకు వెళ్లి వివరాలను సేకరిస్తామని తెలిపారు. సిబ్బందిని పెంచి సర్వే సమగ్రంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బాగ్‌లింగంపల్లిలో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు

సర్వేలో రజకులందరూ పాల్గొనాలి

కవాడిగూడ: సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చే అధికారులకు రజకులు తమ వివరాలు తెలియజేయాలని తెలంగాణ రజక (ధోబీ) అభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం.నర్సింహ కోరారు. శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నర్సింహ రజక, సంస్థ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ మందలపు గాంధీ రజక, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపల్లి రాజశేఖర్ రజక, కొండమీది హరినాథ్ రజక, బొడ్డుపల్లి చుక్కయ్య రజక మాట్లాడుతూ రాజ్యాధికారం సాధించాలంటే రజకుల సంఖ్యా బలం ఎంతో రాష్ట్ర ప్రభుత్వానికి తెలవాలని అన్నారు. సమావేశంలో గ్రేటర్ కార్యదర్శులు బి చంద్రమోహన్, పొట్ల పోచల కిషన్, పెండ్యాల శ్రీధర్, ఎ సుధాకర్, గ్రేటర్ వైస్ చైర్మన్ చీమల అశోక్, ఎ రమేష్, కొనేగారి రమేష్ ఖజానా ధోబీఘాట్ అధ్యక్షుడు అందోల్ సాయి, సత్యనారాయణ, సిహెచ్ శ్రీను. కుమార్ పి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేని స్వాగతిస్తున్నాం

బర్కత్‌పుర: సమగ్ర కుటుంబ సర్వేను స్వాగతిస్తున్నామని, ప్రజలంతా ఈ కులగణన సర్వేకు సహకరించాలని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సర్వే భారత రాజ్యాంగ మూలసిద్ధాంతంపై ఆధారపడిందని రాష్ట్ర ప్రభుత్వం సర్వే రిపోర్టులను త్వరగా తెప్పించి రాజకీయ వాటాని, ఆర్థిక సంపదలో భాగస్వామ్యాన్ని అనగారిన కులాలందరికీ సమానంగా పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించండి

ఆజామాబాద్ ట్రాన్స్‌కో ఏడీఈ ఎం.వినోద్‌కుమార్



రాంనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ ట్రాన్స్‌కో ఏడీఈ పరిధిలోని కరెంట్ వినియోగదారులు తమ నెలవారి కరెంట్ బిల్లులను ఆన్‌లైన్‌లో లేదా ఆజామాబాద్‌లోని ట్రాన్స్‌కో ఆవరణలో గల ఈఆర్‌వో ఈసేవా కేంద్రాల్లో చెల్లించాలే తప్పా ట్రాన్స్‌కో సిబ్బందికి బిల్లు డబ్బులను ఇవ్వొద్దని ఏడీఈ ఎం వినోద్‌కుమార్ సూచించారు. రాంనగర్, ముషీరాబాద్, నారాయణగూడ సెక్షన్లు తమ పరిధిలోకి వస్తాయని, ఆయా ప్రాంతాల్లో కరెంటు కోతలు లేకుండా 24 గంటల పాటు కరెంట్ నాణ్యతతో ఇస్తున్నామని ఆయన తెలిపారు. వినియోగదారులకు సమస్యలుంటే ఆజామాబాద్ ఏడీఈ 94408 12991, రాంనగర్ ఏఈ 94408 13023, ముషీరాబాద్ ఏఈ 94408 13016, నారాయణగూడ ఏఈ 94408 13017లకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఏడీఈ పలు అంశాలు 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

ఆజామాబాద్ ఏడీఈ సెక్షన్ పరిధిలో ఎంత మంది వినియోగదారులున్నారు. నెలకు బిల్లులు ఎంత వస్తాయి?

ఆజామాబాద్ ఏడీఈ పరిధిలో రాంనగర్, ముషీరాబాద్, నారాయణగూడ సెక్షన్ పరిధిలో 52 వేల మంది వినియోగదారులు ఉన్నారు. వీరి నుంచి ప్రతినెలా రూ.6.7 కోట్ల బిల్లులు వస్తాయి. ప్రతీ వినియోగదారుడికి ప్రతినెలా ఏడో తేదీలోపు మీటర్ రీడింగ్‌తీసి బిల్లులు ఇస్తాం. బిల్లు ఇచ్చిన 14 రోజుల్లో అంటే ప్రతినెలా 21వ తేదీలోపు బిల్లులు చెల్లించాలి.

బిల్లులు ఎలా చెల్లించాలి. ఎవరికి ఇవాలి?

కరెంట్ బిల్లుల చెల్లింపు కోసం ట్రాన్స్‌కో ఆన్‌లైన్ చెల్లింపులకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా యూపీఐ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. అలా చెల్లింపులు చేయలేని వారు ఆజామాబాద్‌లోని ట్రాన్స్‌కో ఈఆర్‌వో కేంద్రాల్లో ప్రతీరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు చెల్లించవచ్చు. లేదా ఈ సేవా కేంద్రాల్లో చెల్లించవచ్చు. లైన్‌మెన్‌లకు, మీటర్ రీడింగ్ చూసే వారికి నగదు రూపంలో ఇవ్వకూడదు.

అధిక, లో ఓల్టేజీ సమస్యలు, అనధికారిక కోతలు విధిస్తున్నారని ఆరోపణలున్నాయి. వీటికి మీ సమాధానం?

ఆజమాబాద్ ఏడీఈ పరిధిలోని మూడు సెక్షన్‌లలో లో, హై ఓల్టేజీ సమస్యలు లేవు. ఇకవేళ ఎక్కడైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం, అధికారికంగా ఎలాంటి కరెంట్ కోతలు లేవు. ఎప్పుడైనా మెయింటనెన్స్ సమయంలో ముందస్తుగా ప్రజలకు సమాచారం ఇచ్చి కోతలు విధిస్తున్నాం.

సెపక్‌తక్రా క్రీడను ఖేలో ఇండియాలో చేర్చాలి

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి పెరిక సురేష్ వినతి

గోల్నాక, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి): సెపక్‌తక్రా క్రీడను ఖేలో ఇండియాలో చేర్చి గ్రామీణస్థాయి యువతను జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు కృషి చేయాలని సెపక్‌తక్రా తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు పెరిక సురేష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధాని నరేంద్రమోదీ ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా దేశంలో ఎంతో మందిని క్రీడాకారులుగా తీర్చిదిద్దుతోందని చెప్పారు. సెపక్‌తక్రాను ఖేలో ఇండియాలో చేర్చడంతో పాటు రాష్ట్రంలో ఖేలో ఇండియా స్టేట్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (కేఐఎస్‌సీఈ), ఖేలో ఇండియా అక్రిడేటెడ్ అకాడమీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఫలితంగా తెలంగాణలో సెపక్‌తక్రా క్రీడాభివృద్ధికి దోహదపడుతుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని అభ్యర్థించారు. మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ తరువాత ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన నూతన అధ్యక్షుడు పెరిక సురేష్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అభినందించారు. ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



కిషన్‌రెడ్డిని వినతిపత్రం ఇస్తున్న పెరిక సురేష్

దివ్యాంగుల సంక్షేమానికి ఎల్లప్పుడూ సహకరిస్తా

ఎమ్మెల్యే వెంకటేష్

గోల్నాక, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని దివ్యాంగుల సంక్షేమానికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గం దివ్యాంగుల సంఘం నూతన కార్యవర్గం సభ్యులు శుక్రవారం గోల్నాక తులసీనగర్‌కాలనీలోని క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని దివ్యాంగుల సమస్యలను పరిష్కరించేందుకు తాను అన్ని విధాలుగా అండగా నిలుస్తానన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే ఆ సమస్య పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఎం.భిక్షపతి, మహిళా అధ్యక్షురాలు సరిత, డి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన దివ్యాంగుల నూతన కార్యవర్గం సభ్యులు



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం హృదయ భారతి- స్వర్ణపుష్పం మాసపత్రిక పుష్కరోత్సవం, నేటి భారతంలో స్త్రీ పురస్కారాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొని పురస్కారాలను ప్రధానం చేసి పలు పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంగళ నరసింహారావు, మసన చెన్నప్ప, లక్కరాజు నిర్మల, డాక్టర్ మంగళ మక్కపాటి, కె రామాచారి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

\- రాంనగర్, ఆంధ్రజ్యోతి

ఓటరు జాబితా తయారీకి

రాజకీయ పార్టీలు సహకరించాలి

అటవీ పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్



సమావేశంలో మాట్లాడుతున్న నదీమ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని రాష్ట్ర అటవీ పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఓటరు జాబితా పరిశీలకుడు అహ్మద్ నదీమ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఓటరు జాబితా తయారీపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ముసాయిదా విడుదల చేశారన్నారు. ఆ జాబితాలో తప్పుల సవరణకు అవకాశం కల్పించారని, శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ ఉందన్నారు. డిసెంబరు 24న క్లెయిమ్ అండ్ అబ్జెక్షన్ పరిష్కరిస్తారని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జనవరి 1న తుదిజాబితా ప్రకటించి, జనవరి 6న విడుదల చేస్తార న్నారు. ఓటరు జాబితా తయారీలో పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. జనవరి 1, 2025 తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫికర్‌అలీ, మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, అజయ్‌కుమార్, రాజేష్‌కుమార్, నందకుమార్ మమ్మద్ సొహెల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.